క్లుప్తంగా

బైక్ విజేత ప్రవీణ్ రాథోడ్



ప్రవీణ్ రాథోడ్‌కు బైక్ అందజేస్తున్న అలీఖాన్, కటకం స్వామి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మోరంపూడి జంక్షన్‌లోని రాజమండ్రి స్టీల్స్‌లో జేఎస్‌డబ్ల్యూ నియో స్టీల్ కొనుగోలు చేసిన ఆర్యాపురం నివాసి, రాజేంద్ర ఇన్ఫ్రా అధినేత ప్రవీణ్ రాథోడ్ ఐపీఎల్ స్కీమ్‌లో బైక్‌ను బహుమతిగా గెలుచుకున్నాడు. హోటల్ షెల్టాన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయనకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ కంపెనీ జోనల్ సేల్స్ మేనేజర్ ఎర్షాద్ అలీఖాన్, వీవీ స్టీల్స్ అధినేత కటకం స్వామి బైక్‌ను అందజేశారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని సబ్ డీలర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ పాపారావు

కంబాలచెరువు: ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఫిబ్రవరి తొమ్మిదో తేదీన అనారోగ్యంతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కె.సత్య శ్రీనివాస్ కుటుంబానికి అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీనివాస్ భార్య భవానికి ఆ చెక్కును జిల్లా అడిషనల్ ఎస్పీ సీహెచ్ పాపారావు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇతర బెనిఫిట్లు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పన్ను వసూలుకు ప్రత్యేక కౌంటర్

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజల సౌకర్యార్థం ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి, ఇంటి పన్ను వసూలుకు నగరపాలకసంస్థలో ఈ నెల 26 నుంచి 30 వరకూ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకూ నిర్విరామంగా ఈ కౌంటర్ పనిచేస్తుందన్నారు.

ఆరు ఫ్లైఓవర్లకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- రెండు నెలల్లోనే శంకుస్థాపనలు
- శరవేగంగా మోరంపూడి బ్రిడ్జి పనులు
- ఎంపీ భరత్ రామ్



ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరంలో అభివృద్ధి శరవేగంతో పరుగులు పెడుతోందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశం అనంతరం ఆయన మంగళవారం ఫోన్లో విలేకరులతో మాట్లాడారు. నగరాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారి పొడవునా ప్రధాన జంక్షన్ల వద్ద ఏడు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. ఇప్పటికే మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. వేమగిరి, బొమ్మూరు, లాలాచెరువు, దివాన్ చెరువు, ఓఎన్జీసీ, గామన్ రోడ్డు జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే వీటికి రెండు నెలల్లో శంకుస్థాపనలు జరుగుతాయన్నారు. ఇది కాకుండా రైల్వేశాఖకు సంబంధించి అన్నపూర్ణమ్మపేట క్రాస్ లెవెల్ (ఆర్సీఎల్) వద్ద మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి రానుందన్నారు. దీనికి సంబంధించి రైల్వేశాఖ, ఇంజినీరింగ్ అధికారులు సర్వే పూర్తి చేశారన్నారు. ఇప్పటికే నగరంలో సెంటర్ డివైడర్లు పూర్తయ్యాయని,ప్రధాన జంక్షన్లను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశామని చెప్పారు. రాజానగరం నుంచి కడియపులంక వరకూ సర్వీసు రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. ఈ నిర్మాణాలన్నీ పూర్తయితే రాజమహేంద్రవరం నగర రూపురేఖలు మారడమే కాదు, నగర వాసులకు ప్రమాదాల నుంచి పూర్తి రక్షణ ఏర్పడుతుందన్నారు. ఏ రాష్ట్రంలోని పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్ని ఫ్లైఓవర్ బ్రిడ్జిలు మంజూరైన దాఖలాలు లేవని, ఇది రాజమహేంద్రవరం నగర వాసుల అదృష్టమని సంతోషం వ్యక్తం చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత అజ్జరపు యువసేన



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్

ప్రకాశం నగర్: యువత పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, గెలుపు, ఓటములను సమానంగానే స్వీకరించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 23 వరకూ బత్తిన సుబ్బారావు సేవాసమితి అధ్యక్షుడు బర్రే కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. రెండువారాల పాటు నిర్వహించిన ఈ టోర్నీలో మొత్తం 27 జట్లు తలపడ్డాయి. అజ్జరపు యువసేన విజేతగా, సుబ్బారావు పేట బాలు స్ట్రైకర్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఎంపీ మార్గాని భరత్ రామ్ చేతుల మీదుగా కప్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సిటీ యూత్ అధ్యక్షుడు పితాని రామకృష్ణ, టీకే విశ్వేశ్వరరెడ్డి, సాగర్, గుర్రం గౌతమ్ పాల్గొన్నారు.

శవ రాజకీయాలు మానుకోవాలి

- ఆదిరెడ్డి వాసు తీరు దారుణం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు శ్రీహరి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: తెలుగుదేశం పార్టీ నాయకుడు ఆదిరెడ్డి వాసు శవ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి హితవు పలికారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిలక్ రోడ్డు షిరిడీ సాయి మార్గ్ జంక్షన్‌లో నిర్మాణ దశలో ఉన్న డ్రైనేజీలో పడి యేరుకొండ నాగేశ్వరరావు మృతి చెందడం దురదృష్టకమన్నారు. ఆ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని ప్రకటించారు. ఆ ఘటనపై ఆందోళనలు, అధికారులపై ఆగ్రహావేశాలు, ఎంపీ భరత్‌రామ్‌ను దుర్భాషలాడటం వాసులోని ఈర్ష్య, అసూయను బయట పెట్టిందన్నారు. నగరాన్ని అభివృద్ధి చేయడం, ప్రజా సమస్యల పరిష్కారంలో టీడీపీ విఫలమైందన్నారు. ఎంపీ భరత్‌రామ్ నేతృత్వంలో నగరంలో శరవేగంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. సోమవారం రాత్రి నాగేశ్వరరావు డ్రైనేజీలో పడగానే చుట్టు పక్కల వారు రక్షించడానికి ప్రయత్నించారని, ఆదిరెడ్డి వాసు మాత్రం మనిషి చచ్చిపోయాడంటూ రాద్ధాంతం చేయడం తప్పిస్తే కాపాడటానికి ఏ విధమైన చర్యలు తీసుకోలేకపోయారన్నారు. నగర పాలక సిబ్బందికి, పోలీసుల విధులకు అడ్డుపడి చాలా తప్పు చేశారని, ఈ జాప్యం వల్లే డ్రైనేజీలో పడిన వ్యక్తి మృతి చెందాడని ఆరోపించారు. రాజకీయ పార్టీలు, వర్గాలకు అతీతంగా అందరూ ఎంపీ మార్గాని భరత్ రామ్ చేస్తున్న అభివృద్ధిని చూసి మెచ్చుకుంటుంటే, ఆదిరెడ్డి కుటుంబానికి మాత్రం కనబడక పోవడం దురదృష్టమన్నారు. ఎంపీ భరత్‌రామ్ ఢిల్లీ నుంచి ఫోన్ చేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారన్నారు. సమావేశంలో సంకిస భవానీప్రియ, పోలు విజయలక్ష్మి, రామ్ సాయి దీపు, నక్కా నగేష్, బాల మురళి, గుత్తుల భాస్కర్ పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు అపూర్వ స్పందన

- నియోజకవర్గంలో 63 వేల కుటుంబాల మద్దతు
- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,10,000 కుటుంబాలకుగాను ఇప్పటి వరకూ 63 వేల కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు తెలియజేశాయన్నారు. ఈనెల 29వ తేదీ గడువులోగా 90 శాతం మద్దతు లభిస్తుందన్నారు. పేదరికమే అర్హతగా రాజకీయపార్టీలతో పనిలేకుండా, అవినీతి రహితంగా నేరుగా సంక్షేమ పథకాలను ప్రజల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.2.07 లక్షల కోట్లను సంక్షేమం ద్వారా ప్రజలకు అందించినట్లు చందన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పింఛన్ మంజూరుకు కొంత, ఇచ్చిన పింఛన్‌లో మరికొంత దోచుకునేవారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమంతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? సమస్యలు ఏమైనా ఉన్నాయా? వంటి అంశాలను నేరుగా తెలుసుకోవాలనే భావనతోనే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి మింది నాగేంద్ర, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, ఇన్నీసుపేట కోపరేటివ్ బ్యాంకు వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మరిడయ్య, జేసీఎస్ కన్వీనర్లు తాడాల చక్రవర్తి, తాటికొండ విష్ణుమూర్తి, జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, మాజీ చైర్మన్ కురుమళ్ల ఆంజనేయులు, అంగాడి సత్యప్రియ, దుంపాచంద్రారెడ్డి, మారిశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమావేశం

సీతానగరం: ఉపాధి హామీ పథకం పనులకు కూలీలను పెంచాలని డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగే ఉపాధి హామీ పథకం పనులను 5 వేల మంది కూలీలతో చేయించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉద్యానవన పంటలకు సంబంధించి అంచనాలు రూపొందించాలన్నారు. మునగ ప్లాంటేషన్ వేయించాలని, అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు: మలేరియా రహితంగా జిల్లాను తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా దోమల నివారణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి మంగళవారం స్థానిక వై.జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైద్యాధికారులతో కలసి జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటా, బయట నీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టగలమన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా ప్రకటించి పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ముందుకొచ్చి మలేరియాకు కారణమైన దోమల నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.వసుంధర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు అనేక చోట్ల ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధిపై ఎంపీ భ్రమలో ఉన్నారన్నారు. చంద్రబాబుకు, లోకేష్‌కు ప్రజల్లో బ్రహ్మాండమైన స్పందన వస్తోందన్నారు.

శంకరాచార్యుల జయంతి



శంకరాచార్యుల చిత్రపటానికి పూజలు చేస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులను సమర్థంగా తిప్పికొట్టి, ఆ ధర్మానికి ప్రాణ ప్రతిష్ఠ చేసింది శంకర భగవత్పాదులని ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయ అర్చకుడు నీలకంఠ స్వామి అన్నారు. మంగళవారం జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని నగరంలో పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. గోదావరి గట్టున గల శృంగేరి జగద్గురు శారద పీఠం, శంకరమఠం, ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయాల్లో ఆయన చిత్రపటాలకు పూజలు చేశారు.

ఇంటర్న్‌షిప్‌కు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్రం పీజీ విద్యార్థులు ప్రఖ్యాత పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ వివరాలను ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ మంగళవారం తెలిపారు. రసాయనశాస్త్ర ప్రయోగశాల సమన్వయకర్త డాక్టర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుప్రజ అరుణాచల్ ప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ, ప్రథమ సంవత్సరం విద్యార్థి బి.జగదీష్ హైదరాబాద్ ఐఐటీలోనూ రెండు నెలల పాటు ప్రఖ్యాత శాస్త్రవేత్తల పర్యవేక్షణలో జరిగే పరిశోధనల్లో పాల్గొంటారన్నారు. వీరికి రెండు నెలల పాటు ఉచిత వసతి, ఫెలోషిప్ లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి.నరసింహమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రఘు కవికొండల

కంబాలచెరువు: దానవాయిపేట పాత పోస్టాఫీసు ఎదురుగా ఉన్న హీలియోస్ మల్టీ స్పెషాలిటీ ఎమర్జెన్సీ ట్రామా కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థోపెడిక్ అవగాహన వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఎక్స్‌రే, బీఎండీ, బీఎంఐ, ఆర్ఏ.ఫాక్టర్ యూరిక్ యాసిడ్ పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ రఘు కవికొండల మాట్లాడుతూ వేగవంతమైన ఆధునిక జీవన విధానంలో ఎక్కువ మంది కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారన్నారు. అలాంటి వారందరికీ ఈ వ్యాధులపై అవగాహన కల్పించి చికిత్స అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే అన్నిరకాల ఎముకల వ్యాధులకు ఆధునిక పద్ధతుల ద్వారా చికిత్స అందుబాటులో ఉందన్నారు.

ఉత్సాహంగా గడప గడపకూ మన ప్రభుత్వం



కడియంలో బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: మండల కేంద్రమైన కడియంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ హాజరయ్యారు. బొబ్బిలి బ్రిడ్జి సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానికంగా ఉండే సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, పార్టీ నాయకులు సాపిరెడ్డి కామేష్, దొడ్డా బుజ్జి, సాపిరెడ్డి సూరిబాబు, బొమ్మిరెడ్డి సత్తిబాబు, కడియం గణేష్, ఎం.శ్రీనివాస్, మణి తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

సీతానగరం: దేవీపట్నం మండలం రామన్నపాలేనికి చెందిన బొమ్మిన వీరబాబుకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై కె.శుభశేఖర్ మంగళవారం తెలిపారు. వీరబాబు తన మోటారు సైకిల్‌పై సారా తరలిస్తుండగా పురుషోత్తపట్నం శివారున అరెస్ట్ చేసి, 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ప్రకాశం నగర్: పారిశ్రామిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర నాయకులు రావుల వెంకయ్య, వి.ఉమామహేశ్వరావు పిలుపునిచ్చారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద మంగళవారం సాయంత్రం మోదీ హటావో.. దేశం బచావో ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్నారని, ఎన్నో ఏళ్ల పోరాడి సాధించుకున్న చట్టాలను సైతం తొలగించారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, సీపీఎం సీపీఐ నగర కార్యదర్శులు వి.కొండలరావు, బి.పవన్ పాల్గొన్నారు.

ప్రజలకు నేరుగా సేవలందించేవి పంచాయతీలే



రాష్ట్రస్థాయి అవార్డు పొందిన జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్‌ను సత్కరిస్తున్న మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు

కడియం: క్షేత్రస్థాయిలో ప్రజలకు నేరుగా సేవలందించేవి పంచాయతీ పాలకవర్గాలేనని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశాన్ని పురస్కరించుకుని మంగళవారం సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా నిలిచిన జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్‌తో పాటు, మండలంలోని సర్పంచ్‌లు, ఆయా గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువా, మెమెంటో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. స్టాలిన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే స్థానికంగా ఆదాయ వనరులు పెంపొందించుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్‌లను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, మోసిగంటి సత్యవతి, చెక్కపల్లి మురళీకృష్ణ, మార్గాని అమ్మాజీ, కొత్తపల్లి సత్యవతి, అయినవిల్లి రుక్మిణీ తదితరులను సత్కరించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, తహసీల్దార్ ఎం.సుజాత, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, వైస్ ఎంపీపీలు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, నాయకులు బత్తుల రాము, కె.వెంకటేశ్వరరావు, అయినవిల్లి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. అంతకు ముందు శాఖల వారీగా మండల పరిధిలోని ప్రగతిని సమావేశంలో వివరించారు.